జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 11-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 422 పేజీలు: 4 వెల : రూ.7



# త్వరలో ఆలయాలకు.. ట్రస్టు బోర్డులు

* అరసవల్లి సూర్యనారాయణస్వామి పాలకమండలి సభ్యత్వం కోసం పలువురు పోటీ * కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు * ఎవరికి వారు మంతనాలు చేసుకుంటున్న టీడీపీ నేతలు * ఈసారి తమకు అవకాశం కల్పించాలంటున్న బీజేపీ, జనసేన నేతలు
* జాబితా సిద్ధమైపోయిందంటూ ప్రచారం

**శ్రీకాకుళం, ఆగస్టు 10 (వార్త):** జిల్లాలోని ఆలయాలతో త్వరలో ట్రస్టు బోర్డులు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు దేవదాయశాఖ ఉన్నతాధికారులు పలు సూచనలు, నిబంధనలను ప్రకటిస్తూ ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. అరసవల్లి సూర్యనారాయణస్వామి, శ్రీకూర్మం కూర్మనాథ స్వామి ఆలయాలతో పాటు మరికొన్ని ఆలయాలకు త్వరలో పాలకమండళ్లను నియమించనున్నారు. రూ.5 కోట్లు నుంచి రూ.20 కోట్ల లోపు వార్షికాదాయం ఉన్న అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో 12 మంది సభ్యులతో పాలకమండలి సభ్యులను, రూ.కోటి నుంచి రూ.5 కోట్లలోపు వార్షికాదాయం ఉన్న శ్రీకూర్మం ఆలయంలో 9 మందితో పాలకమండలి ఏర్పాటు చేస్తారు. అరసవల్లి ఆలయానికి వంశపారంపర్యంగా ఇప్పిలి జోగిసన్యాసిరావు ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా, శ్రీకూర్మం ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా విజయనగరానికి చెందిన పూసపాటి అశోక్‌గజపతిరాజు ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కొనసాగుతారు. కేవలం పాలకమండలి సభ్యుల స్థానాలు మాత్రమే భర్తీ చేస్తారు. ఆసక్తి ఉన్నవారు తమ అర్హతలతో ఆలయాల కార్యనిర్వహణాధికారులకు దరఖాస్తులను సమర్పించాలని జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్ తెలిపారు. ఇప్పటికే చాలామంది అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం పాలకమండలిలో సభ్యత్వం కోసం పోటీ పడుతున్నారు. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు శ్రీకాకుళం ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈసారి ఎలాగైతే తమ కు సభ్యత్వం కల్పించాలని కోరుతున్నారు. అయితే పాలకమండలిలో ఎవరెవరికి ఇవ్వాలన్నది ఒక జాబితాను సిద్ధం చేశారని, త్వరలో ప్రకటించే అవకాశం ఉందని టీడీపీ చెందిన ఓ నేత చెబుతున్నారు. అయితే ఈసారి బీజేపీ, జనసేన నేతలు సైతం ఈ పాలకమండలి సభ్యత్వం కోసం పోటీ పడుతున్నారు.

# పర్యాటక కేంద్రంగా.. తేలినీలాపురం

* ఎకోటూరిజం ద్వారా పర్యాటక కేంద్రాల అభివృద్ధి
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * తేలినీలాపురం పక్షుల కేంద్రం సందర్శన



**టెక్కలి, ఆగస్టు 10(వార్త):** విదేశీ పక్షులకు అవాసంగా ఉన్న తేలినీలాపురంను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆ ప్రాంతాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకోటూరిజంలో తేలినీలాపురంను అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ఇప్పటికే పలు ప్రతిపాధనలు రూపొందించడం జరిగిందన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. తొలుత గ్రామస్తులతో మంత్రి మాట్లాడి స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు వీలుగా విడిది సౌకర్యాలు చేయాల్సి ఉందని అన్నారు. ఈ ప్రాంతంలో మూటపేట పోర్టు నిర్మాణం జరుగుతోందని, రానున్న రోజుల్లో పారిశ్రామిక కేంద్రంగా మారనుందని వివరించారు. టెక్కలి ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందడానికి మౌలిక వసతులు పెద్దఎత్తున సమకూర్చడం జరుగుతుందని అన్నారు. మూలపేట నుంచి భోగాపురం విమానశ్రయం వరకు రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే తీర ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి, ఎల్.ఎల్. నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై దాడి

* రూ.1,02,360 స్వాధీనం
* అదుపులో తొమ్మిది మంది



**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 10 (వార్త):** పొందూరు పోలీసు స్టేషన్ పరిధిలో లోలుగు గ్రామ శివారులోని తోటలో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పొందూరు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం దాడులు చేశారు. తోటలో జూదమాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 1,02,360 నగదు, ఆరు బైక్‌లు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## బలగలో దొంగలు పడ్డారు



**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 10 (వార్త):** నగరంలోని బలగలో ఆదివారం దొంగలు పడ్డారు. సీపాన కోమలి (35) గత ఏడు నెలలుగా కళింగ అపార్ట్‌మెంట్స్ 2వఅంతస్తులో నివాసముంటున్నారు. ఈనెల 8న సాయంత్రం 4 గంటలకు నరసన్నపేట సమీపంలోని సత్యవరం గ్రామంలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం పొరుగువారు ఇంటి తలుపులు బద్దలైనట్లు చెప్పడంతో హుటాహుటిన ఆమె ఇంటికి చేరుకున్నారు. బీరువాలో ఆరు తులాల బంగారం, రూ.50 వేల నగదు మాయం అయినట్లు కోమలి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూ టౌన్ పోలీసులు ఆ ఇంటిని, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ ఇంటి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మహిళలకు భద్రత కరువు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 10(వార్త):** కూటమిపాలనలో రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉళాల భారతీ దివ్య అన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందన్నారు. రూ.5 లక్షలకు పర్మిట్ రూములు ఇచ్చి మద్యం ద్వారా ఆదాయం పెంచాలని ప్రభుత్వం భావించడం విచారకరమన్నారు. మహిళలకు భద్రత కరువైందని, జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు, గుడి, బడి అని తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలు, బెల్టు షాపులు ఏర్పాటు చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మరో దగాకు స్వీకారం చుట్టారని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీల్లో రాష్ట్రమంతా ఫ్రీ బస్ అని ప్రకటించి ఇప్పుడు నిబంధనలు విధించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే మహిళలకు రాష్ట్రమంతటా ఏ బస్సులో అయినా ఉచితంగా ఎక్కడికైనా ప్రయాణించే విధంగా నిబంధనలు సవరించాలని డిమాండ్ చేశారు.



# ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి





**మందస, ఆగస్టు 10(వార్త):** ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని మందస మండల శాఖ అధ్యక్షుడు జగదీష్ బడిత్య అధ్యక్షతన ఆదివారం హరిపురంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితుడు బాబూరావు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేయగా, యూటీఎఫ్ పతాకాన్ని కామ్రేడ్ లండ రాజారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020ను వేగంగా అమలు చేసిన రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ అగ్ర భాగాన ఉందన్నారు. తమిళనాడు, కేరళ లాంటి రాష్ట్రాలు అందరికీ చదువుకునే అవకాశాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని బలహీనపరిచే ఈ విద్యా విధా నం అవసరం లేదని తెగేసి చెబుతున్నా, మన రాష్ట్రంలో పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. దీంతో 12,572 ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని వాపోయారు. 5000 ఫౌండేషన్ స్కూళ్లలో కూడా ఒక్క ఉపాధ్యాయుడే పని చేస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య వచ్చే అవకాశం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్లో 9.8 శాతం నుంచి 11 శాతం వరకు నిధులు మాత్రమే విద్యారంగానికి కేటాయిస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి గున్న రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరినీ ఐక్యపరచి అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా యూటీఎఫ్ ప్రస్థానం సాగుతోందన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, రీ గ్రూపింగ్ స్కేల్, ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీం, అప్రెంటిషిప్ విధానం రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్లు అమలు, బదిలీలలో కౌన్సిలింగ్ విధానం అమలు వంటి సమస్యల సాధనలో యూటీఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించడంలో యూటీఎఫ్ ముందుంటుందని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి ప్రతి ఉపాధ్యాయుడు ఒక గంట అదనంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మందస మండలంలో రద్దు కాబడిన 10 యూపీ పాఠశాలల్లో హెున్నాలి, కొరడాబడి ప్రాథమికోన్నత పాఠశాలలను పున: ప్రారంభించడానికి యూటీఎఫ్ ముఖ్య బాధ్యత వహించిందని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు జన్ని సోమేశ్వరరావు, మందస మండలం పూర్వపు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండలరావు, మాధవరావు, మండల కోశాధికారి శిష్టు సోమనాథ్, జిల్లా కౌన్సిలర్లు కిరణ్, రాజు, గున్న రమణబాబు, తరిని సోమేశ్వరరావు, మల్లేశ్వరరావు, ఈవీ రమణ, అప్పారావు, గంగారావు, బాలార్జునపాత్రో, నల్ల ధనుంజయ్, మజ్జి శివకేశవరావు, కార్మిక సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పలాస:** విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయుల సంక్షేమానికి చిత్తశుద్ధిగా యూటీఎఫ్ పనిచేస్తుందని జిల్లా కార్యదర్శి కంచరాన రమేష్ అన్నారు. ఆదివారం పలాస మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, ఇప్పటివరకు ఉపాధ్యాయులు సాధించుకున్న హక్కులు రాయితీలను నిలబట్టుకునేందుకు సైతం పోరాటం చేయాలన్నారు. యూటీఎఫ్ పతాకాన్ని పలాస మండల శాఖ గౌరవాధ్యక్షులు కె.ప్రసాద రావు ఎగురవేశారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్.వెంకటాచలం మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ప్రతి ఒక్క ఉపాధ్యాయులు పాటుపడాలని, తాము పనిచేసే పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాన్నారు. కార్యక్రమంలో పలాస మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ, టి.అప్పారావు, ఎం.సంతోష్, వజ్రపు కొత్తూరు మండల శాఖ అధ్యక్షులు సీహెచ్ ధర్మారావు, కంచరాన జయరాం, యూటీఎఫ్ నాయకులు కె.రవీంద్ర, కేవీఎస్ ప్రసాదరావు, డి.శరత్, మన్మథరావు, తుంగాన తిరుపతిరావు, ఢిల్లేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీలో మాతల యువత చేరిక

**-పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన సిరిపురం**

**కొత్తూరు, ఆగస్టు 10(వార్త) :** పాతపట్నంలోని భారతీయ జనతా పార్టీ క్యాంపు కార్యాలయంలో కొత్తూరు మండలం, మాతల గ్రామ పంచాయతీకి చెందిన పట్టా శివ, బైరెడ్డి మల్లేష్, పట్టా వాసుదేవరావు, పట్టా బాలరాజు, ముప్పిడి రఘు ఆదివారం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీలోకి చేరారు. వీరికి సిరిపురం.. పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తూరు మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు మండల అధ్యక్షుడు బురడా భాస్కరరావు, పూర్వ జిల్లా ఉపాధ్యక్షుడు దుక్క శ్రీకాంత్ రెడ్డి, బడియాల బాబురావు, అనుమంచిపల్లి దుర్గాప్రసాద్, ఆనంద్, జాన్ కటారి పాల్గొన్నారు.

## సీపీఐ నేత నారాయణ దృష్టికి
# వంశధార సమస్య

**మందస, ఆగస్టు 10(వార్త):** సీపీఐ జాతీయ నేత, పొలిట్బ్యూరో సభ్యుడు నారాయణ దృష్టికి వంశధార సమస్యను తీసుకెళ్లనున్నట్టు వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు తెలిపారు. మందస, వజ్రపుకొత్తూరు పర్యటనకు ఈ నెల 12న వస్తున్న నారాయణను వంశధార సాగునీరు సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మథరావు ఆధ్వర్యంలో కలియనున్నామన్నారు. ఉదయం 8గంటలకు మందస మండలంలోని మార్పు గ్రంథాలయానికి సభ్యులందరూ చేరుకోవాలని సూచించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# జిల్లా పరిషత్‌లో నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**-జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, ఆగస్టు 10(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్జీల నమోదు, వాటి స్థితి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా అర్జీదారుల కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## వైసీపీ బలోపేతానికి గ్రామ కమిటీలు

**మందస ఆగస్టు 10(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి అధ్యక్షతన వీరగున్నమ్మపురంలో ఆదివారం జరిగింది. గ్రామ కమిటీల కార్యవర్గంను త్వరిగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు. తమ నాయకులపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాలను ధీటుగా ఎదుర్కోవాలని నిర్ణయించారు. క్లస్టర్ వారీగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి కార్యకర్తలు సమావేశం జరపాలని నిర్ణయించారు. సమావేశంలో ఎంపీపీ దానయ్య, అనుబంధ విభాగాల కన్వీనర్లు గోపాల్, బిట్టు, జయరాం, మండల యువజన విభాగం అధ్యక్షుడు కిషోర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రావు, పీతాంబరం, జేసీఎస్ కన్వీనర్ చింతాడ గణపతి, మండల పార్టీ నాయకులు సురేష్ పాణిగ్రాహి, బృందా, జి.తిరుపతిరెడ్డి, బాడ జగన్, కంచి, గుంపు జగదీష్, తలగాన హరికృష్ణ, బేపల చిన్నారెడ్డి, నారాయణ, సోషల్ మీడియా సభ్యులు జీవన్, రామా రావు తదితరులు పాల్గొన్నారు.

## పలాస వైశ్య సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక



**పలాస, ఆగస్టు10(వార్త):** పలాస వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శ్రీకన్యకాపరమేశ్వరి మందిరంలో ఆదివారం జరిగింది. 2025-27కు గాను నూతన అధ్యక్షుడిగా డోకి నాగేశ్వరరావు, కార్యదర్శిగా తంగుడు కామేశ్వరరావు, కోశాధికారిగా కోట్ని శశికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. వీరికి పలాస రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డోకి రామారావు, పలువురు అభినందనలు తెలిపారు.

## ఘనంగా స్వర్ణ భారతి ఫ్రెషర్స్ డే వేడుకలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 10(వార్త):** ఇచ్ఛాపురం స్వర్ణభారతి జూనియర్ కళాశాలలో ఆదివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైతే సమయాన్ని సద్వినియోగం చేసుకుంటారో వారే విజేతలుగా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తెలియజేశారు. ఇంటర్మీడియట్ స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని, వాటిని సాధించడానికి సరైన ప్రణాళికలు వేసుకొని, శ్రమించాలని, విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ బోర్డ్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందిస్తూ, మొమెంటోలు అందజేశారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చాట్ల సుజాత రెడ్డి, కళాశాల ఇంచార్జ్ చాట్ల రాము రెడ్డి , చాట్లా నవీన, విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ జయప్రకాష్, సందీప్, శ్రీనివాస్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేర ప్రవృత్తి వీడాలి

**శ్రీకాకుళం, ఆగస్టు 10(వార్త):** జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం శ్రీకాకుళం రెండో పట్టణ, గార, జలుమూరు తోపాటు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషనులో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షింది లేదని స్పష్టం చేశారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా శాంతికి భంగం కలిగిస్తే రౌడీషీటర్లపై చట్టపరమైన మరింత కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనుమానితుల కదలికలను పోలీసు శాఖ ఎల్లపుడూ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, నేర ప్రవృత్తి విడనాడాలని హితవు పలికారు.




# ఘనంగా ఎమ్మెల్యే అశోక్ జన్మదిన వేడుకలు





**ఇచ్ఛాపురం, ఆగస్టు 10(వార్త):** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ జన్మ దిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత స్వేచ్ఛవతి అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన రాగోలు జెమ్స్ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో 36 మంది ఈసీజీ తీసుకున్నారు. ఓపీలో సుమారు 380 మంది రోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లోపింటి పద్మనాభం, దక్కత ఢిల్లీరావు, దక్కత కామేశ్వరరావు, సాడి సహదేవ్ రెడ్డి, మెరుగు సూర్యనారాయణ, బోరుభద్ర లోహిదాస్, పత్రి తవిటయ్య, నందిగం కోటి, కాళ్ల ధర్మారావు, కాళ్ల దిలీప్, ఆసి లీలా రాణి, పేదిని బాబ్జి, సుభాష్ రౌలో, దట్టి శ్రీను, నందికి జాని, గిరీష్,




కొర్రాయి ధర్మరాజు, జన్నెల సంతోష్, సాలీనా జగదీష్, తెలుకల శ్రీనివాస్ సాహు, కృష్ణయ్య, రెయ్యి జాని, కాశినాథ్ రథో, వెంకట్ రెడ్డి, లింగరాజు, తారకేశ్, గిలాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రక్తదాతకు పాదాభివందనం : ఎమ్మెల్యే శంకర్



**శ్రీకాకుళం నగరం, ఆగస్టు 10(వార్త):** 'రక్తదాతలకు పాదాభివందనమని, వారు సమాజానికి నిజమైన సేవకులని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మార్కెట్ మర్చెంట్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ శిబిరానికి ఎమ్మెల్యే శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భగవంతుడు జన్మనిస్తే, వైద్యులు ప్రాణం పోసి పునర్జన్మనిస్తారు. ఆ పునర్జన్మలో రక్తదాతల పాత్ర అమూల్యం" అన్నారు. ప్రతీ ఏటా ఈ రెండు సంఘాలు చేపడుతున్న రక్తదాన సేవ సమాజానికి ఆదర్శమని ప్రశంసించారు. అధ్యక్షులు కోరాడ హరగోపాల్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను కూడా అనేకసార్లు రక్తదానం చేశానని, యువత ముందుకు వచ్చి రక్తదానంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. "మన ఇళ్లలో జరిగే వేడుకలలోనూ రక్తదానాన్ని ఒక భాగంగా మార్చి, సామాజిక బాధ్యతలో ముందుండాలి" అన్నారు. వాతావరణ మార్పులతో రక్త కొరత పెరుగుతుందని, అలాంటి పరిస్థితుల్లో ఇలాంటి శిబిరాలు ప్రాణాలను రక్షించడమే కాకుండా, శ్రీకాకుళంలో రక్తకొరత లేని పరిస్థితి సృష్టిస్తున్నాయని తెలిపారు. అనంతరం రక్తదాతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు.

# శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి

**- డీఎస్పీ వెంకట అప్పారావు**

**పలాస, ఆగస్టు 10(వార్త):** శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు అన్నారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్లో పనిచేసిన ఎస్ఐ-2 మెట్ట చంద్రరావు దంపతులకు పదవీ విరమణ వీడ్కోలు సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు చేయకుండా, తనకి అప్పజెప్పిన పని చేసిన వ్యక్తిని చంద్రారావుని కొని యాడారు. పోలీస్ డిపార్ట్మెంట్లో పనిచేయడం సవాళ్లుతో కూడిన పనని, అలాంటి పని దిగ్గజయంగా పనిచేసే వ్యక్తిని అన్నారు. రిటైర్మెంట్‌తో



వచ్చిన బెనిఫిట్స్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, ఏఎస్ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 10(వార్త):** రోటరీ క్లబ్ యువజన మాసోత్సవాలలో భాగంగా ఇచ్ఛాపురంలో సూపర్ సిక్స్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎఫ్ 11 విజేతగా నిలి చింది. రన్నర్‌గా ఛాంపియన్ బాయ్స్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా రోహిత్, బెస్ట్ బౌలర్‌గా హరీష్, ప్లేయర్ ఆఫ్ సిరీస్‌గా సంతు నిలిచారు. కోఆర్డినేటర్‌గా గోపి వ్యవహరించారు. కార్యక్రమంలో రామకోటి, రామారావు పాల్గొన్నారు.




# అభివృద్ధిని చూడలేక విష ప్రచారం

*** టీడీపీ నేత తమ్మినేని చంద్రశేఖర్**

**ఆమదాలవలస, ఆగస్టు 10(వార్త):** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల మేలు కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో విశేషమైన ఆదరణ వస్తోందని, దీన్ని చూడలేక వైసీపీ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, విష ప్రచారం చేస్తున్నారని ఆమదాలవలస మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ప్రజల నమ్మకం గెలుచుకోవడం అంటే అభివృద్ధి, సంక్షేమం ద్వారా వారి గుండెల్లో చోటు సంపాదించుకోవడమేనన్నారు. వైఎస్ఆర్సీపీ నాయకులు ఈ మార్గాన్ని అనుసరించడానికి బదులు, అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, మౌలిక వసతుల



అభివృద్ధి, రైతు సంక్షేమం, ఉద్యోగ సృష్టి ఇవన్నీ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తెస్తున్నాయని తెలిపారు. ఈ సత్యాన్ని మరుగుపరచడం కోసం వైఎస్ఆర్సీపీ కించపరిచే భాషలో మాట్లాడటం సిగ్గుచేటుగా ఉందన్నారు. కూటమి లక్ష్యం రాజకీయ లాభం కాదని, ప్రజల మేలు చేయడమేనన్నారు. విద్య, వైద్యం, పింఛన్లు, రైతు బంధు, మహిళా సంక్షేమం ఇలా ప్రతి రంగంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మార్పులు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల తీర్పు ఎప్పుడూ సత్యానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అసత్యాలు, విషప్రసారం చేసి ఓట్లు గెలుచుకోవాలని ప్రయత్నించే వారికి భవిష్యత్తులో స్థానం ఉండదదని చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

## జనార్దనరావును అభినందించిన మంత్రి

**శ్రీకాకుళం, ఆగస్టు 10(వార్త):** నౌపడా ప్రభుత్వ జూనియర్ కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకుడు రుంకు జనార్దనరావు ఇంటర్ విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్ ను, ప్రయోగ దీపికలను తయారు చేసి అందిస్తున్నారు. ఇవి రాష్ట్ర వ్యాప్తంగా గల అధ్యాపకులు, విద్యార్థులతో విశేష ఆదరణ పొందాయి. ఈ ఏడాది సిలబస్ మారడంతో ఈ పుస్తకాలను నవీకరించారు. వీటిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్దన్‌రావును మంత్రి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పాఠ్య పుస్తకాలు తయారుచేసి భావితరాలకి మంచి భవిష్యత్తు అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.



# రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం

**-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

**-జిల్లాలో 2,74,208 మంది రైతులకు**

**రూ.186 కోట్ల అన్నదాత సుఖీభవ నిధుల జమ**

**-అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకు అందిస్తాం**



**శ్రీకాకుళం, ఆగస్టు 10(వార్త):** రైతుల అభ్యున్నతి, వ్యవసాయ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పంట ఉత్పాదకతను మెరుగుపరచేందుకు, మార్కెట్ సౌకర్యాలను విస్తరించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలే రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశామన్నారు. జిల్లాలో 2,74,208 మంది రైతులకు రూ.186 కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు త్రినాథ స్వామి, జగన్మోహన్ రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్అండ్ఆర్ కాలనీలో భూమి పూజ

**సంతబొమ్మాళి :** మూలపేట పోర్టు నిర్వాసితులకు నౌపడ ఆర్అండ్ఆర్ కాలనీలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ తదితర విభాగాల్లో రూ.32 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. పోర్టు నిర్మాణంతో జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందు తుందని, పోర్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్ళు త్యాగం చేసిన మూలపేట, విష్ణుచక్రం గ్రామాల ప్రజ లకు పునరావస కాలనీలో ఎటువంటి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. ఇప్పటికే విద్యుత్ సరఫరా ఏర్పాటు చేశామని, సిమెంట్ రోడ్లు, బడి,గుడి నిర్మాణం కూడా చేపడతా మన్నారు. పోర్టు నిర్వాసితుల గ్రామాల ప్రజలు ఎటువంటి ఆందోళన పడకూడదని అందరీ సమస్యల పరిష్కారం చేస్తామన్నారు. పునరావాస కాలనీ ఒక ఆదర్శంగా తీర్చిదిద్దాలని అదికారులకు సూచించారు. నౌపడ 3 రోడ్లు జంక్షన్ కు చెందిన పలువురు పోర్ట్ రోడ్డు బాధితులు తమకు ఇల్లు నిర్మాణానికి భూమిని కేటాయించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అంతకు మందు 50 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నౌపడ -టెక్కలి రహదారి నుంచి ఇజ్జువరం గ్రామానికి సిమెంట్ రోడ్డుకు శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిక్ దిన కర్, ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ హేమసుందం రావు, టీడీపీ నాయకులు జీరు భీమారావు, ఎల్ ఎల్ నాయుడు, అట్టాడ రాంప్రసాద్, రెడ్డి అప్పన్న, బొడ్డేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



### వర్షం కురవాలని పూజలు



**నందిగాం, ఆగస్టు 10(వార్త):** వర్షం కురవాలని కాపు తెంబూరు రైతులు గ్రామ దేవత కొండసీతమ్మ తల్లికి ఆదివారం పూజలు చేశారు. తల్లి నెలకొన్న ప్రదేశానికి చేరుకుని వరద పాయసం పోసి తిన్నారు. అనంతరం భజనలు చేపట్టారు.

## అథ్లెటిక్స్ పోటీల్లో జ్ఞానభారతి విద్యార్థుల ప్రతిభ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 10(వార్త):** సీబీఎస్ఈ క్లస్టర్7 అథ్లెటిక్స్ పోటీల్లో జ్ఞానభారతి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. పలు పతకాలు కైవసం చేసుకున్నారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కానుగూరు అక్షర విద్యాలయ పాఠశాలలో ఈనెల 5న ప్రారంభమైన పోటీలు ఆదివారంతో ముగిసాయి. జావెలిన్ త్రోలో 11వ తరగతి విద్యార్థి అఖిల్‌యాదవ్ ద్వితీయ స్థానం లో నిలిచి వెండి పతకాన్ని సాధించాడు.జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 11వ తరగతి విద్యార్థి ప్రవీణ్‌కుమార్ 1500 మీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానంలో నిలిచి రజత పతకం గెలుచు కు న్నాడు. పదవ తరగతి విద్యార్థిని డి.లతాశ్రీ ట్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానాన్ని సాధించి రజత పథకం గెలుచుకుంది. వీరికి పాఠశాల కార్యదర్శి సీఈఓ జోహార్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి అభినందనలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, కైలాస్ పండాను ప్రత్యేకంగా అభినందించారు. అథ్లెటిక్స్ బృందానికి మేనేజర్లుగా ఫాతిమా, ప్రశాంత్ వ్యవహరించారు.










Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546